

కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్ రూరల్, బాల్కొండ మే 7(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. మండలంలోని పెర్కిట్ శివారులో, బాల్కొండ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించి అన్‌లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం నిల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్నందునా ధాన్యం నిల్వలతో కూడిన వాహనాలు రైస్‌మిల్లుల వద్ద ఎక్కువ సమయం తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో అర్వింద్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఐకేపీ మోప్మా అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాలి: కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి, క్లోరోఫాం, ఆల్ఫాజోలం వంటి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయిచైతన్య సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. మత్తు పదార్థాల రవాణాపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఎలాంటి సమాచారం తెలిసినా పరస్పరం చర్చించుకుని వాటి నిరోధానికి పకడ్బందీ కార్యచరణలతో ముందుకు వెళ్లాలని అధికారులకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి చేపట్టవల్సిన చర్యల గురించి సీపీ సాయిచైతన్య అధికారులకు తగు సూచనలు చేశారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా అన్ని విద్యాసంస్థల్లో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పాన్ షాపులు, ఇతర దుకాణాల్లో సిగరేట్లు, గుట్కాలు, నికోటిన్ కలిగిన పదార్థాలు విక్రయించకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి వివిధ మార్గాల ద్వారా గుట్టుగా ఇక్కడికి తరలిస్తున్నారని ఎక్కువగా రైలు మార్గం ద్వారా రవాణా అవకాశాలు ఉన్నందున రైల్వే అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీకల్లు తయారీ కోసం వినియోగించే ఆల్ప్రోజోలం నిలువ గురించి ఆరాతీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్ పై జిల్లాలో సంబరాలు

డిచ్‌పల్లి/బాల్కొండ/ముప్కాల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో టెర్రరిస్టుల స్థావరాలపై భారతసైన్యం మంగళవారం అర్ధరాత్రి మెరుపు దాడుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సంబరాలు జరుపుకొన్నారు. భారత దళాలు చేపట్టిన దాడులను ప్రశంసించారు. సాయుధ దళాల ఆపరేషన్ పట్ల గర్వంగా ఉందంటూ జిల్లా వ్యాప్తంగా భారత సైన్యానికి మద్దతు ప్రకటించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

బాల్కొండ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. పహల్గామ్ అమరవీరుల తల్లులు, భార్యలు, కుమార్తెలను కోల్పోయిన పసుపు కుంకుమలకు నివాళులే ఈ ఆపరేషన్ సిందూర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తౌట్ అరవింద్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్‌ఖాన్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, యూనుస్, విద్యాసాగర్, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, చిట్టి పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల మద్దతు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి జిల్లా ప్రవేట్ డిగ్రీ కళాశాలల యాజమన్యాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పిన భారత ఆర్మీకి మద్దతు తెలిపారు. పహల్గామ్ అమరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌పై భారత్ ఆర్మీ మెరుపు దాడిచేయడం హర్షనీయమన్నారు. రానున్న రోజుల్లో పాక్‌కు మరింత బుద్ధి వచ్చేలా చేయాలన్నారు. భారత్ వైపు ఉగ్రవాదులు చూడాలంటే భయపడి పోవాలన్నారు. పహల్గామ్‌లో మృతి చెందిన వారికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీయూ పీసీఎంఏ అధ్యక్షుడు హరిప్రసాద్, సంజీవ్, నరాల సుధాకర్, తరుణ్, గురువేందర్, దత్తు, నవీన్, శ్రీనివాస్, రాజు, అతిఖ్, విజయ్, గంగాధర్, నరేందర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత సంబరాలు..

ముప్కాల్ మండల కేంద్రంలో ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేయడంతో బుధవారం యువత సంబరాలు జరుపుకొన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను ఏరివేసేందుకు ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో యువత మండల కేంద్రంలో టపాకాయలు పేల్చి విజయోత్సవాలు జరుపుకొన్నారు.



బాల్కొండలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



ముప్కాల్‌లో విజయోత్సవ సంబురాలు చేసుకుంటున్న యువత



డిచ్‌పల్లిలో ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు



అమ్మవారికి నామకరణం చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినోత్సవం

నిజామాబాద్ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినోత్సవ ఉత్సవం ఘనంగా సాగింది. బుధవారం అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్‌లో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జన్మదినోత్సవంలో భాగంగా వేద పండితుల వేద మంత్రోచ్చరణలో అఖండ దీపారాధనతో ఉత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక వాసవీ కన్యకాపరమేశ్వరి కుంకుమార్చన పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి నామకరణోత్సవం జరిపారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాదంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్ గుప్త, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి రాఘవేంద్ర, కన్వీనర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ఉంటాయి : ఎమ్మెల్యే

హిందూ ధర్మాన్ని రక్షించడానికి వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు భక్తులపై ఉంటాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో గల కిషన్ గంజ్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి జన్మదినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలతోపాటు అమ్మవారికి నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘ కార్యవర్గం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● కొత్తపల్లి శివారులో ఎన్ఎస్ఎఫ్ భూమి



ఎన్ఎస్ఎఫ్ భూమి కబ్జా!

- కోటగిరి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ
- సమాచార హక్కు చట్టంతో బయటపడిన అక్రమాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఎన్ఎస్ఎఫ్ అధికారులు
- కలెక్టర్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు



శ్రీధర్, (రైతు బస్వాపూర్)

కోటగిరి, మే7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ఎన్ఎస్ఎఫ్, చెరువులు, సాగునీటి కాలువల ఖాళీ స్థలాలు దర్జాగా ఆక్రమిస్తున్న దళారులపై చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు తలెత్తుతున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే భూములను కబ్జా చేసి సాగు చేస్తున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే ఏకంగా కోటగిరి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మరీ ఎన్ఎస్ఎఫ్ భూమిని కబ్జా చేసిన సంఘటన సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి వచ్చింది. అధికారం.. రెవెన్యూ అధికారుల అండదండలు ఉంటే కబ్జా చేడానికి కాదేది అనర్హం అన్న చందంగా మారింది. కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిజాంషుగర్స్ భూముల వ్యవహారం ఇందుకు నిదర్శనంగా మారింది. ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ సందర్భంగా కర్మాగారానికి చెందిన భూములను ప్రభుత్వం వేలం వేసింది. వేలంలో భాగంగా కొత్తపల్లి శివారులోని ఏడున్నర ఎకరాల భూమిని జాస్తి నాగేశ్వర్ రావు అనే వ్యక్తి కొనుగోలు చేశారు. 118, 119సర్వే నెంబర్లపై 4.34 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. దీంతో పాటు మరో సర్వే నెంబర్‌లో మరి కొంత భూమిని కొనుగోలు చేశారు. ఇంత వరకు భూ విక్రయం సజావుగా సాగింది. ఇక్కడి నుంచి అసలు కథ ప్రారంభమైంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి అప్పటి కిందిస్థాయి రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ఎన్ఎస్ఎఫ్ భూములపై చక్రం తిప్పారు. కొనుగోలు చేసిన వ్యక్తి కబ్జాలోకి రాకపోవడంతో ఇదే అదనుగా పహాణీలలో మాజీ ప్రజాప్రతినిధి తన కుటుంబ సభ్యుల పేర్లను తప్పుడు సర్వే నెంబర్లతో నమోదు చేయించడం విశేషం. 118/1 సర్వే నెంబర్‌లో 2.11ఎకరాలు, 119/1 సర్వే నెంబర్ 2.23ఎకరాలు తన తనయుడు కోలా సీతారాం పేరు మీద నకిలీ పట్టాపాస్ పుస్తకాలు సృష్టించాడు. 13-10-2013 తేదిన నకిలీ ఆర్‌వోఆర్ ద్వారా తనతో పాటు కుటుంబ సభ్యుల పేరు మీద మరికొన్ని సర్వే నెంబర్లు సృష్టించి 8.28ఎకరాల భూమిని మాజీ ప్రజాప్రతినిధి రిజిస్ట్రేషన్ చేసుకోవడం గమనార్హం. 118, 119 సర్వే నెంబర్‌లలో భూమిని కొనుగోలు చేసిన నాగేశ్వర్ రావు రిజిస్ట్రేషన్ చేయించుకుని భూహక్కులు పొందినప్పటికీ సాగులోకి వెళ్లకపోవడం కబ్జాదారులకు వరంగా మారింది. భూమిని కొనుగోలు చేసిన వ్యక్తికి రైతుబంధు అమలు కావడంతో పాటు ప్రతియేటా తన భూమికి సంబంధించి పహాణీ తీసుకోవడానికే పరిమితమయ్యారు. ఈ భూమిని సాగు చేయకపోవడంతో కబ్జాదారు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించుకోవడం విశేషం. భూయజమాని ఇటీవల తన భూమిని ఇతరులకు విక్రయించారు. మండలంలోని స్వాపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్ అనే రైతు వివాదాస్పదంగా మారిన భూమిని కొనుగోలు చేశారు. తన భూమిని స్వాధీనం చేసుకునేందుకు అక్కడికి వెళ్లగా భూమిని కబ్జా చేసిన మాజీ ప్రజాప్రతినిధి ఆయనను అడ్డుకున్నారు. దీంతో కొనుగోలు చేసిన రైతు శ్రీధర్ సమాచార హక్కు చట్టం కింద రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశారు. దరఖాస్తు స్వీకరించిన రెవెన్యూ అధికారులు ఈ సర్వే నెంబర్ల భూమిపై సమగ్ర వివరాలు వెల్లడించారు. ఈ సర్వే నెంబర్లపై నకిలీ పట్టాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



గతంలో ఇచ్చిన నకిలీ పాస్ బుక్

సమాచార హక్కు చట్టంతో అక్రమాలు బహిర్గతం..

కొత్తపల్లి శివారులోని 118. 119 సర్వే నెంబర్‌లలో ఫ్యాక్టరీ భూమిని ఎవరెవరికి విక్రయించారనేది ఈ నెల 8వ తేదిన కొనుగోలు చేసిన రైతు శ్రీధర్ సమాచార హక్కు చట్టం కింద దర ఖాస్తు చేశాడు. ఈ రెండు సర్వే నెంబర్‌లలో 4.34ఎకరాల భూమిని జాస్తి నాగేశ్వర్ రావు కొనుగోలు చేశారు. 1992-93, 2003-04, 2006-07 పట్టాదారు కాలంలో ఎన్ఎస్ఎఫ్ భూమిగా ఉండగా అనుభవదారు కాలంలో కోలా ఫకీరా నాయక్ ఖరీదుదారుగా నమోదు కావడం విశేషం. పహాణీలో ఎలాంటి ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేకుండా నమోదు చేయడం విశేషం, 2005-06నుంచి 2013-14వరకు జాస్తి నాగేశ్వర్ రావు పేరు మీద మరోమారు పహాణీలో నమోదు చేశారు. భూమిని కబ్జా చేసిన వ్యక్తి వద్ద ఉన్న ఆర్‌వోఆర్ ఉత్తర్వులు నకిలీవని రెవెన్యూ అధికారులు తేల్చారు. అప్పటి తహసీల్దార్ మోహన్ సంతకం ఫోర్జరీ చేసినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

కలెక్టర్‌కు రైతు ఫిర్యాదు..

కొత్తపల్లి శివారులో 118, 119 సర్వే నెంబర్‌లలో గల భూమిని ఫోర్జరీ సంతకాలతో నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించారని కొనుగోలు చేసిన రైతు శ్రీధర్ కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాను కొనుగోలు చేసిన భూమిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్తే సదరు కబ్జాదారు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని రైతు ఫిర్యాదులో పేర్కొన్నారు. నకిలీ పట్టాలపై సమగ్ర విచారణ జరిపి తన భూమి తనకు కేటాయించాలని రైతు శ్రీధర్ కోరారు.



నకిలీ ఆర్‌వోఆర్ పత్రం

రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

● నగర కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, చిత్రంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

నిజామాబాద్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన అవసరం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం నగరంలోని బస్వాగార్డెన్‌లో నగర అధ్యక్షుడు కేశవేణు అధ్యక్షతన నగర కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిశీలకుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కార్యకర్త కష్టపడ్డాడని ఇప్పుడు కార్యకర్తల కోసం మేమంతా కష్టపడి కార్పొరేషన్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకుంటామన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తే గెలుపు మనదేనన్నారు. పార్టీకి కష్టపడితేనే పదవులు వస్తాయని ఆయన అన్నారు. నిజామాబాద్ నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అమృత్‌స్కీమ్ కింద 18 కొత్త ట్యాకులను నిర్మిస్తున్నామని అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. చిన్న చిన్న గొడవలను పక్కనబెట్టి పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని ఆయన అన్నారు. ఐక్యంగా ఉంటేనే అందరికి పదవులు వస్తాయని కార్యకర్తల రుణం తీర్చుకునే సమయం వచ్చిందని నాయకులంతా కార్యకర్తల కోసం పనిచేస్తామన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు డివిజన్, పట్టణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ప్రతీ కార్యకర్తకు పదవులు ఇవ్వడమే లక్ష్యంగా పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సందర్భంగా తీవ్రవాదుల స్థావరాలపై దాడులు చేసిన భారత ఆర్మీకి అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఏఐసీసీ మోడల్‌గా తెలంగాణను ఎంపిక చేసిందని ఇటీవల గుజరాత్‌లో జరిగిన పార్టీ ప్లీనరీలో ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారిని గుర్తించి పదవులు ఇచ్చే లా పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి ఒక్కరికి పార్టీ అవకాశం ఇస్తుందని పార్టీని బలోపేతం చేస్తేనే నాయకులుగా ఎదుగుతామన్నారు. ఎన్ఎస్‌యుఐ నాయకుడిగా తాను చేసిన పనికి అధిష్టానం గుర్తించి ఎమ్మెల్సీ చేసిందని అన్నారు. పార్టీలో కష్టపడిన వారికి పదవులు వస్తాయనడానికి తానే నిదర్శనం అన్నారు. డివిజన్‌లలో పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. ఎంఐఎంతో ఎలాంటి పొత్తు లేదని ఈ విషయంలో పార్టీ అధిష్టానం స్పష్టంగా ఉందన్నారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, సిరిసిల్లా గ్రంథాలయ ఛైర్మన్ సత్యనారాయణ, నాయకులు నగేష్‌రెడ్డి, రత్నాకర్, జావెద్ అక్రమ్, ఢిల్లీ, రామర్తిగోపి, విపుల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నగరంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను షబ్బీర్ అలీ పంపిణీ చేశారు. దాదాపు 12లక్షల విలువైన చెక్కులను 15 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సెల్యూట్ కార్యక్రమం..

ఇటీవల జమ్మూకాశ్మీర్ పహల్‌గామ్‌లో జరిగిన తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ, తీవ్రవాద స్థావరాలపై దాడులు చేసిన భారత్ ఆర్మీకి ధన్యవాదాలు తెలుపుతూ బుధవారం సాయంత్రం నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సెల్యూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారత ఆర్మీకి సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మానాల మోహన్‌రెడ్డి, కేశవేణు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ భిక్షపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న నార్కోటిక్స్ ఏసీపీ శంకర్‌యాదవ్



బోధన్‌లో మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ సుబ్బారామి రెడ్డి

కల్తీకల్లు, డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

● యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ జిల్లా అధికారి భిక్షపతిరావు

మోపాల్, మే 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు కల్తీకల్లు, డ్రగ్స్‌కు బానిసలు కావద్దని యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ జిల్లా అధికారి భిక్షపతిరావు అన్నారు. బుధవారం మండలంలోని మంచిప్ప, న్యాల్‌కల్, ముదక్‌పల్లి, మోపాల్ గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో యాంటి నార్కొటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, కల్తీకల్లును నిర్మూలించాలని గ్రామాల్లో ర్యాలీ అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటి నార్కోటిక్స్ డ్రగ్స్ జిల్లా అధికారి భిక్షపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీకల్లు తాగడం వల్ల అనారోగ్యాల బారిన పడి అనేక మంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కల్తీకల్లుకు, డ్రగ్స్‌కు యువత బానిసలవుతున్నారని అన్నారు. కల్తీకల్లు, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని అన్నారు. ఎవరైనా ఇటువంటి మాదకద్రవ్యాలు అమ్మినట్లయితే 1980 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. మహిళలు, గర్భిణులు కల్తీకల్లు తాగడం వల్ల పుట్టబోయే పిల్లలు అనారోగ్యాలబారిన పడుతున్నారని అన్నారు. ఈత చెట్లనుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లును తాగాలని అన్నారు. తమ వ్యాపారం కోసం కొందరు కల్లులో అల్ప్రాజోలం కలిపి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ మల్లేష్, ముదక్‌పల్లి డాక్టర్ ప్రత్యూష, ఎస్‌ఐ యాదగిరి, ఏఎస్‌ఐ రమేష్, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతి నిధులు, వీడీసీ సభ్యులు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నవీపేట: రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు, కల్తీకల్లును నిర్మూలించాల్సిన అవసరం ఎంతైన ఉందని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కరుణ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని నవీపేట, జన్నేపల్లి, ఫకీరాబాద్, ఫత్తేనగర్‌లలో జరిగిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు క్రీడ సామగ్రిని అందజేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వినయ్, ఎక్సైజ్ ఎస్‌ఐ గంగాధర్, నవీపేట మెడికల్ ఆఫీసర్ కావ్య, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్, తెడ్డు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: గ్రామీణప్రాంతాల్లో యువత మత్తు పదార్థాలు, గంజాయి, కల్తీకల్లు, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసై కల్తీకల్లు తాగుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ మాదక ద్రవ్యాల నిరోధక చట్టం డీఎస్పీ శ్రీధర్ అన్నారు. మండలంలోని ఇందల్వాయి, గన్నారం, నల్లవెల్లి, లోలం తదితర గ్రామాల్లో ప్రజలకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు కల్తీకల్లు తాగితే కాళ్ల చేతులు పడిపోవడం, కంటి చూపు తగ్గడం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తి ప్రాణాలుపోయే ప్రమాదం ఉందని కల్తీ కల్లులో ఎక్కువగా డైజోఫామ్, ఆల్ప్రజాలం లాంటి మత్తు పదార్థాలు వాడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ శ్రీధర్, సీఐ మల్లేష్,ఎస్సై, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ముప్కాల్: కల్తీకల్లు, మారకద్రవ్యాల వినియోగంతో యువత నిర్వీర్యంగా మారుతుందని నార్కోటిక్స్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యాడ్‌వద్ద కల్తీకల్లు, మాదకద్రవాయల వినియోగంపై తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో నరేష్ ఆనంద్, వీడీసీ అధ్యక్షుడు సిద్ధి రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు రాజేశ్వర్,సెక్రటరీ,సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని మోర్తాడ్, దొన్కల్, ధర్మోరా గ్రామాలలో కల్తీకల్లు, కల్తీకల్లు తీసుకునే వినియోగదారుల ఆరోగ్యంపై వాటి ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మోర్తాడ్ గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ యాంటీ కార్కోటిక్ బ్యూరో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తున్న జీవన్‌రెడ్డి, ఎక్సైజ్ అధికారులు ప్రజలకు కల్తీకల్లు వల్ల కలిగే దుష్పరిమానాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్ర మంలో ఎస్సై విక్రం, ఎక్సైజ్ అధికారులు మానస, డాక్టర్ స్పందన, ఐసీడీ ఎస్ అధికారి మంజులా, కార్యదర్శి సైఫుద్దీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్స్ ఏసీపీ శంకర్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని జక్రాన్‌పల్లి, సికింద్రాపూర్, తొర్లికొండ, మునిపల్లి గ్రామాలలో గంజాయి, డ్రక్స్, కల్తీకల్లు, మత్తుపదార్థాలపై యువకులకు, గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం యువతకు, విద్యా ర్థులకు క్రీడాసా మాగ్రిలైన వాలీబాల్, టెన్నికాయిట్స్ , ఇతర క్రీడాసామగ్రిని ఏసీపీ శంకర్ యాదవ్ అందజేశారు. అనంతరం ఈ గ్రామాలలో పోలీసులు, యువకులు, విద్యార్థులు, ప్రజలు ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ప్రమోద్ చైతన్య, సందీప్, జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రెహమాన్, ఏఎస్సై వెంకట్‌కు మార్, వైద్యాధికారి రవీందర్,ఏఎన్‌ఎంలు,ఆరోగ్యసిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రెంజల్: తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు నిర్మూలనపై బుధవారం రెంజల్ మండల కేంద్రంతో పాటు సాటాపూర్, నీలా, కందకుర్తి గ్రామాలలో నార్కోటిక్ బ్యూరో సీఐ సామ్యా నాయక్, రెంజల్ ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుకు దూరంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుని డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిరికొండ: పోలీస్ కమిషనర్ ఆదేశానుసారంగా సిరికొండ మండలంలోని కొండాపూర్, గడ్కోల్, సిరికొండ, పెద్దవాల్గోట్ గ్రామాల్లో బుధవారం నాడు పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల్లో నార్కోటిక్ ఏసీపీ దీక్షిత్, సీఐ బిక్షపతి మాట్లాడుతూ కల్తీకల్లు అలవాటు పడితే జీవితం అదోగతి పాలవుతుందని అన్నారు. కార్యక్రమంలో సిరికొండ ఎస్సై ఎల్.రామ్, ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటగిరి: కల్తీకల్లు ఆరోగ్యానికి హానికరమని యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ రమేష్ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద బుధవారం మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో 104గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం స్వచ్ఛమైన కల్లు దొరకడం లేదన్నారు. ప్లకార్డులతో పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. పొతంగల్ మండలంలోని పొతంగల్, హంగర్గ గ్రామాల్లోనూ మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు నిర్మూలనపై ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాబ్ సీఐ పూర్ణేశ్వర్, ఎక్సైజ్ సీఐ విలాస్ కుమార్, రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్‌ఐలు సాయన్న, సునీల్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: యువత మత్తు పదార్థాలకు భానిసై తమ విలువైన జీవితాన్ని పాడుచేసుకోవద్దని టీఎస్‌న్యాబ్ ఎస్సై జీవన్‌రెడ్డి, ఎక్సైజ్‌ఎస్సై మానస, ఏర్గట్ల ఎస్సైరాము తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో తెలం గాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మండలంలోని యువకులకు కల్తికల్లు తాగడం, మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండలంలోని యువకులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: డ్రగ్స్ యువత జీవితాన్ని నాశనం చేస్తుందని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ సుబ్బారామి రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో కల్తీకల్లుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని సాలూ, పెగడాపల్లి, కల్దుర్కి, రాంపూర్ తదితర గ్రామాలలో తెలంగాణ ఎంఏబీ ఏసీపీ సోమనాథం, రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి, శిక్షణ ఎస్‌ఐ రమా, ఎక్సైజ్ ఎస్‌ఐ జలీల్ హైమద్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోస్రా: చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో ఆబ్కారీ శాఖ నార్కోటిక్ నిరోధక శాఖ ఆధ్వర్యంలో కల్తీకల్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలను నిషేధించాలని మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రత్యేక అధికారి నీలావతి మాట్లాడుతూ ఇంట్లో పెద్దలు, పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి, పాఠశాల, కళాశాల నుండి రాగానే వారు ఏం చేస్తున్నారు గమనిస్తూ క్రమశిక్షణ పద్ధతిలో పెంచాలి, ఇప్పుడు చూస్తున్న కాలంలో కల్లుబట్టిలకు, వైన్స్‌లకు పంపి వారికి మత్తు అలవాటు చేసే మార్గం చూపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, యువకులుపాల్గొన్నారు.

డిచ్‌పల్లి: యువత మత్తుపదార్థల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకొవద్దని యువకులు తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు సన్మర్గంలో నడిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో సీఐ శ్రీనివాస్ అన్నారు. కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు మండలం లోని ఘన్‌పూర్, సుద్దులం, యానంపల్లి, దూస్‌గాం గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో సీఐ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై షరీఫ్ ఆరోగ్య అధికారిని రాజ్యలక్ష్మీ, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: యువత మత్తుకు బానిస కావొద్దని నారోకటిక్ సీఐ హేమలత అన్నారు. బుధవారం మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో కల్తీకల్లు, మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే నష్టాలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు అజయ్‌పవర్, ఎస్సై మహేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొట్టాల సాయిబాబా, రాగుల మోహన్, పిట్ల శ్రీనివాస్, మోర్తాడ్ లింబాద్రి, బాల్‌రెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

వేల్పూర్: జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుకు ప్రతీ ఒక్కరు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ రామునాయక్ సూచించారు. నిజామాబాద్ సీపీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని పడిగెల, పచ్చల నడ్కుడ, వేల్పూర్ గ్రామాలలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో కల్తీకల్లుపై, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ప్రభుత్వ వై ద్యాధికారి శరత్‌చంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, పోలీస్‌లు శైలాద్, శివ, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, సాయికిరణ్, మహిపాల్, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ రూరల్: యువత గంజాయి కల్తీకల్లు లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పెర్కిట్, చేపూర్, ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామాలలో బుధవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి యాంటీనార్కోటిక్స్ బ్యూరో పుష్పన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు మారక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ రంజిత్‌రావ్, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, నందిపేట్ ఎస్సై చిరంజీవి, పంచాయితీ కార్యదర్శి తరుణ్, యువకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఎడపల్లి: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు ఆరోగ్యానికి హానికరమని యాంటీ నార్కోటిక్ బ్యూరో సీఐ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఎడపల్లి మండల కేంద్రంతోపాటు మంగల్‌పాడ్, కుర్నాపల్లి, జానకంపేట గ్రామాలలో బుధవారం మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు పోల మల్కారెడ్డి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

మెండోర: కల్తీకల్లు ఆరోగ్యానికి చిల్లు లాంటిదని యాంటీ నార్కోటిక్ సీఐ కృష్ణమూర్తి, మెండోర ఎస్సై యాసిర్ అర్ఫత్ అన్నారు. బుధవారం మండలంలోని మెండోర, వెల్కటూర్, దూదిగాం, చాకిర్యాల్ గ్రామాల్లో కల్తీకల్లు, మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ స్వాతి, సెక్రటరీలు రాజ్‌కుమార్, భరత్, అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని సర్వసమాజ్ భవనంలో డ్రగ్స్, గంజాయి, కల్తీకల్లుపట్ల జరిగే అనార్థాలపై నార్కోటిక్ బ్యూరో సీఐ హేమలత ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేష్, జిల్లా చైల్డ్ వెల్ఫర్ ఆఫీసర్ దీప్‌సింగ్, డాక్టర్ అజయ్‌పవార్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 65శాతం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

● జిల్లా ఇన్‌చార్జి పశువైద్య అధికారి రోహిత్ రెడ్డి



అడ్కాస్‌పల్లిలో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేడీఏ

కోటగిరి,మే7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ 65శాతం పూర్తయిందని జిల్లా ఇన్‌చార్జి పశువైద్య అధికారి రోహిత్ రెడ్డి తెలిపారు. కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి, బస్వాపూర్ గ్రామాలలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. టీకాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి పశువైద్య అధికారి రోహిత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సి ఉందన్నారు. గత నెల 15వ తేదిన ప్రారంభమైన టీకాల పంపిణీ కార్యక్రమం ఈ నెల 14వ తేదిన ముగుస్తుందన్నారు. ఇప్పటి వరకు 1,30,345 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. మరో 35శాతం వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి సురేష్, పశువైద్య సిబ్బంది సుధీర్, సాయిలు, లక్ష్మి, గోపాల మిత్రులు రాములు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జల్లాపల్లి ఆబాదిలో తాగునీటి సమస్య పరిష్కారం



ఆబాదిలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ముప్పినాయక్

కోటగిరి,మే7(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాదీ గ్రామంలో బుధవారం తాగునీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిష్కరించారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ఖాళీ బిందెలతో నిరసన అనే కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. బోధన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ముప్పినాయక్ గ్రామంలో పర్యటించి తాగునీటి సమస్యపై వాకబు చేశారు. పైప్‌లైన్ లీకేజీతో పాటు గ్రామంలో వాటర్ మెన్ అందుబాటులో లేకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని పలువురు డీఈకి ఫిర్యాదు చేశారు. పైప్‌లైన్ లీకేజీని అప్పటికప్పుడే అరికట్టి వాటర్ మెన్ నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో చందర్, ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రాజలింగం, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులున్నారు.

అంత్యక్రియలకు వెళ్లి అనంత లోకాలకు..

● యంచ గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

నవీపేట,మే7(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరిలో ప్రమాదవశాత్తు మునిగి నిజామాబాద్ అంబేద్కర్ కాలనీకి చెందిన మారంపల్లి గంగాధర్(45) మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. గంగాధర్ నిజామాబాద్ మున్సిపల్‌లో కూలీ పని చేసేవాడని మంగళవారం అతని సమీప బంధువు సాయమ్మ మండలంలోని యంచలో అనారోగ్యంతో మృతి చెందడంతో అదే రోజున గంగాధర్‌తో పాటు అతని భార్య సాయిలతతో కలిసి యంచకు వెళ్లడం జరిగిందని అన్నారు. సాయమ్మ అంత్యక్రియల అనంతరం పలువురు సమీపంలో ఉన్న యంచ గోదావరిలో కాళ్లు, చేతులు కడుక్కొని ఇంటికి చేరుకున్నారని అన్నారు. ఆ సమయంలో మారంపల్లి గంగాధర్ ఆచూకీ లభించకపోగా బుధవారం ఉదయం యంచ గోదావరిలో నీటిలో మృతదేహం తేలి ఉందని అన్నారు. అతడు కాళ్లు, చేతులు కడుక్కునే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి గోదావరి నదిలో మునిగి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య సాయిలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంఐఎం పార్టీ బోధన్ అధ్యక్షుడిగా మీర్ ఇలియాజ్ అలీ

బోధన్‌రూరల్,మే7(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడిగా మీర్ ఇలియాజ్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మలక్‌పేట ఎమ్మెల్యే మహ్మద్ బిలలా సమక్షంలో బోధన్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మీర్ ఇలియాజ్ అలీ, సెక్రెటరీగా హైమద్ బిన్ మొసిన్, కోశాధికారిగా ఖదీర్ ఖాన్‌తో పాటు 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మీర్ ఇలియాజ్ అలీ మాట్లాడుతూ పార్టీ అధినాయకత్వం అసదుద్దీన్ ఓవైసీ, మలక్‌పేట ఎమ్మెల్యే మహ్మద్ బిలాల తనపై నమ్మకం ఉంచి పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు తదితరులున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఉత్సవాలు

డిచ్‌పల్లి,మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బీ) పోతూలూరి వీరాబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి అభిషేక అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.

పడిగెలలో బ్రహ్మంగారి ఆలయం వద్ద ఆరాధన ఉత్సవాలు

వేల్పూర్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలం పడిగెల గ్రామంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన ఉత్సవాలను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అర్చన, అభిషేకం, మహిళలు మంగళహారతులతో వీరబ్ర హ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి చట్టం

● రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

మెండోర, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రజల భూసమస్యలు పరిష్కరించేందుకే భూభారతి చట్టం అని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బుధవారం వెల్కటూర్ గ్రామంలో భూభారతి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి దేశానికే రోల్ మోడల్ అవుతుందని అన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజగౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్ నర్సారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్‌ఐ వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.



వెల్గటూర్‌లో రైతుసదస్సులో పాల్గొన్న ఈరవత్రి అనిల్

పల్లె దవాఖానలో కేంద్ర బృందం తనిఖీ



కేంద్ర బృందంతో పల్లె దవాఖాన సిబ్బంది

మోస్రా,మే7(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో గల పల్లె దవాఖానలో బుధవారం (ఎన్‌క్వాస్) కేంద్ర బృందం తనిఖీలు నిర్వహించింది. నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ ద్వారా కేంద్రం, రాష్ట్రం నుంచి ఇద్దరు చొప్పున ఎక్స్‌టర్నల్ పరిశీలకులు వచ్చి దాని ప్రకారం మార్చి 20న ఆన్‌లైన్‌లో పరిశీలించి ఆకస్మికంగా పల్లె దవాఖాన పరిశీలించి ఎలాంటి సదుపాయాలు ఉన్నవి లేని సదుపాయాలు ఏమిటని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా పరిశీలనలో 80 శాతం సర్వే పూర్తి కాగా బుధవారం పల్లె దవాఖానా సందర్శించి సిబ్బందితో మాట్లాడి పూర్తి వసతులను, ఔషధాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ దినేష్, కార్యక్రమం అధికారి డాక్టర్ రాకేష్, డీపీఎం విశాల రాణి, మండల వైద్య అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు

ఎడపల్లి,మే7(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనం నడిపిన వ్యక్తికి బోధన్ కోర్టు రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్ 14వ తేదీన చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో పట్టుబడిన ఎడపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని బుధవారం బోధన్ కోర్టులో హాజరు పరుచగా స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడుపవద్దని, ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

ఉగ్రవాదం అంతం కావాల్సిందే

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతిరెడ్డి

ఆర్మూర్ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం అంతం కావాల్సిందేనని పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పోరాటానికి ఒక భారతీయుడిగా గర్వపడుతున్నానని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. ఉగ్రవాదం ఉన్మాదం ఏ రూపంలో ఉన్న ప్రపంచ మానవాలికి నష్టం కల్గించేదే తప్ప లాభం చేకూర్చేదికాదన్నారు. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్ని ఏకమై ఉగ్రవాదాన్ని అందమొందిస్తేనే శాంతి, సామరస్యాలు నెలకొంటాయన్నారు. భారత సైన్యానికి అభినందనలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

రైతు ధర్నాను జయప్రదం చేయాలి

మోర్తాడ్, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం అఖిల భారత వ్యవసాయ కాంగ్రెస్ సంఘం ఆధ్వర్యంలో గోడప్రతులను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ఈనెల 8న జరుగనున్నా రైతు ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెడుతున్నదని ఆరోపించారు.

'పార్టీ కోసం పనిచేస్తున్న వారికే పదవులు'



సమావేశంలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

మోర్తాడ్, మే 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకే పదవులు దక్కుతాయని ఎమ్మెల్సీ పార్టీ పరిశీలకులు బల్మూరి వెంకట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్‌ఎన్‌బీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పరిశీలకుడుగా హాజరయ్యారు. త్వరలో జరుగనున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఎన్నికల విదానం గురించి ఆయన వివరించారు. 2017 ముందు పార్టీలో పనిచేస్తున్న వారికి ప్రాముఖ్యత ఉంటుందని తర్వాత వచ్చిన వారికి మండ కమిటీల స్థానం లభించే అవకాశం ఉందని ఆయన వివరించారు. నాయకుల మధ్య విబేదాలు ఉన్నాయని కార్యకర్తలు వివరించారని ఈ విషయం పట్ల తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, సహకార సంస్థ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ , మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ పరిశీలకుడు, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి ప్రసంగించారు.

ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రంగాల పనితీరును మెరుగుపరిచేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమల సంస్థ జిల్లాకు ఈడీసీ మేనేజర్, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, 9640909831 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులకు అవకాశం

దోమకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): దోమకొండ ఫోర్ట్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు, ఇతర టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నట్లు కోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి బుధవారం తెలిపారు. మ్యాజిక్ బస్ అనే సంస్థ కంప్యూటర్ శిక్షణను ఉచితంగా నేర్పించి, ఇతర నైపుణ్యాలను గుర్తించి వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ట్రస్ట్ చర్యలు చేపడతుందన్నారు. పూర్తి వివరాలకు 9493143378 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు

దోమకొండ, మే7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకం అయిన ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియ ప్రారంభించామని మండల వ్యవసాయధికారిణి మణిదీపిక అన్నారు. బుధవారం రైతువేదికలో రైతుల వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు క్రిష్ణారెడ్డి, మాన్యూష, రైతులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : ప్రతి రైతుకు ఆధార్ తరహాలోనే 11 నెంబర్లతో కూడిన యూనిక్ కోడ్‌ను నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని ప్రతిరైతుకు రిజిస్ట్రేషన్ చేశామని వ్యవసాయాధికారి ప్రజాపతి తెలిపారు. బుధవారం మండలంలోని అమర్లబండలో ఏఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతుకు తనకున్న భూముల వివరాలతో ఈ రిజిస్ట్రేషన్‌ను చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ పథకం, తదితరులకు మలి విడత అందజేయడానికి ఈ కోడ్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

భిక్కనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో శిక్షణపొందిన వారికి ప్రభుత్వం నుంచి కావాల్సిన ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని నిరుద్యోగ యువ తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దోమకొండ సీడీపీవో రోజిప్మ, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది శిరీష, గ్రామపంచాయతీ ఈవో మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలి : ఆర్డీవో

భిక్కనూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని ఆర్డీవో వీణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద తప్పకుండా టార్పలిన్‌లు అందుబాటులో ఉంచాలని, కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెం టవెంటనే తూకం చేసి ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎం రాజేందర్, డీసీఎస్‌వో మల్లిఖార్జున్, విండో చైర్మన్ రాజాగౌడ్, తహసీల్దార్ శివప్రసాద్, డీటీ కిష్టయ్య, సీఈవో మోహన్‌గౌడ్, ఏఈవో లత పాల్గొన్నారు.

ఆరునెలల్లో శాశ్వత టోల్‌ప్లాజా పనులు పూర్తి

● ఎన్‌హెచ్‌ఏఐ పీడీ శ్రీనివాసరావు

భిక్కనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్లకట్టవాగు సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆరునెలల్లో శాశ్వత టోల్‌ప్లాజా నిర్మాణం చేపట్టామని ఆరునెలల్లో ఈ నిర్మాణాన్ని పూర్తిచేస్తామని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం శాశ్వత టోల్‌ప్లాజా నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. టోల్‌ప్లాజాను అన్నిహంగులతో నిర్మించామని, శాశ్వత నిర్మా ణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. టోల్‌ప్లాజాలో ఎవ్వరికి మిన హాయింపు లేదని లోకల్ వాహనాలకు పాస్‌లు ఏర్పాటు చేయాలన్నారు.





ఫోకస్

అధ్వానంగా తయారైన టీటీడీసీ భవనాలు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన కంప్యూటర్ గది



వృథగా పడి ఉన్న జనరేటర్

నాడు కళకళ.. నేడు వెలవెల

- అధ్వానంగా మారిన టీటీడీసీ కేంద్రం
- దొంగల పాలవుతున్న సామగ్రి
- పట్టించుకోని డీఆర్డీవో అధికారులు

డిచ్‌పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకైక టెక్నికల్ ట్రైజామ్ కేంద్రం డిచ్‌పల్లిలో 2010 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలోని మంత్రులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వరరావు గ్రామీణ నిరుద్యోగ యువతి, యువకులకు పలు రకాల ఉచిత శిక్షణలు ఇచ్చేందుకు టీటీడీసీ కార్యాలయం ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల పాటు సేవలందించిన ఈ టీటీడీసీ మూడేళ్లుగా ఆలనా పాలన కరువై పూర్తిగా జిల్లా డీఆర్డీవో అధికారులు మూసివేశారు. ఎంతో మంది నిరుద్యోగులకు, ఐకేపీ మహిళా సమాఖ్యల సమావేశాలకు సేవలందించిన ఈ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. నాడు ఒక వెలుగు వెలిగిన ఈ టీటీడీసీ నేడు కళావిహీనంగా తయారైంది. జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తరుపున ఉచితంగా శిక్షణ లు ఇచ్చే ఈ కార్యాలయం మూసి వేయడంతో నిరుద్యోగులకు ఆర్థిక భారం పడి ప్రైవేట్ సంస్థలలో శిక్షణలు పొందుతున్నారు. కంప్యూటర్ ట్రైనింగ్, టైలరింగ్ వంటి ఉచిత శిక్షణలు ఈ కార్యాలయంలో అందించేవారు. అదేవిధంగా గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన డీపీ రాయుడు జిల్లా కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగించి ఒక మినీ కలెక్టర్‌గా తీర్చిదిద్దారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ కార్యాలయం పాడుపడి మూసివేయంతో మహిళ సమాఖ్య సమావేశాలకు, నిరుద్యోగుల సేవలకు దూరమైంది. ఆలనా పాలన కరువవడంతో కార్యాలయంలోని తలుపులు, ఏసీలు, కంప్యూటర్ పరికారాలు, జనరేటర్ వంటివి గుర్తు తెలియని దొంగలు చోరీలు చేస్తున్నారు. రాత్రి సమాయంలో మద్యం ప్రియులకు అడ్డగా మారి అసాంఘిక కార్యాక్రమాలు జరుగుతున్నా యని స్థానికులు వాపోతున్నారు. గత 6 నెలల క్రితం డీఆర్డీవో పీడీ సాయాగౌడ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కేంద్రాన్ని సందర్శించిన ఫలితం శూన్యం. కావున ఇప్పటికైనా ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు, స్పందించి తిరిగి టీటీడీపీ పునఃప్రారంభించాలని నిరుద్యోగ యువతీ యువకులు, మహిళ సమాఖ్య సంఘాలు కోరుతున్నారు.

సమయ పాలన పాటించని అధికారులు

- కార్యదర్శి రాకకు నిరీక్షణ చేసిన జుక్కల్ ప్రజలు
- డుమ్మా కొట్టే అధికారులకు పరోక్ష మద్దతిస్తున్న జుక్కల్ ఎంపీడీవో

జుక్కల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 12.33 నిమిషాలు సమయం అయినప్పటికీ జుక్కల్ గ్రామపంచాయతీ కార్యాలయం తాళం వేసి ఉంది. కార్యాలయంకు పనికోసం వచ్చిన జుక్కల్ ప్రజలకు తాళం చూసి అవాక్కయ్యారు. జుక్కల్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు జుక్కల్ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. బుధవారం రోజు జుక్కల్ ప్రజలు ఇంటి పన్ను కడతామని వెళ్లిన వారికి కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ భవనానికి తాళం ఉండడంతో ప్రజలు కార్యదర్శి రాక కోసం నిరీక్షించారు. పంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు హెడ్ క్వార్టర్‌లో ఉండకుండా ఇతర మండలాల నుంచి గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తూ వారికి వచ్చిన విధంగా వారానికి మూడు నాలుగు రోజులు విధులు నిర్వహిస్తూ సమయపాలన పాటించకుండా వారి ఇష్టానుసారంగా సమయపాలన పాటించకుండా నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోతో దోస్తాన చేస్తూ డుమ్మా కొట్టే పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో పరోక్ష మద్దతిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉంది. జుక్కల్ పంచాయతీ కార్యదర్శిపై సంబంధిత ఉన్నత అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చేరే తీసుకోవాలని జుక్కల్ మండల్ ప్రజలు డిమాండ్ చేశారు.



జుక్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయం



12.33ని.లకు తాళం వేసి ఉన్న దృశ్యం

● జుక్కల్ ఎంపీడీవో వివరణ

జుక్కల్ పంచాయతీ కార్యాలయానికి సమయం 12.30 అయినప్పటికీ కార్యాలయానికి తాళం వేసి ఉంది. కార్యదర్శి, సిబ్బంది ఎవరు లేరని జుక్కల్ ఎంపీడీవోను ప్రశ్నించగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమాచారం విలేకరులకు చెప్పాల్సిన అవసరం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

నసురుల్లాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నస్రుల్లాబాద్ మండల పరిధిలోని నిజామాబాద్, బాన్సువాడ, బోధన్, హైదరాబాద్, వెళ్లే ప్రయాణికులు మండల కేంద్రమైన నసురుల్లాబాద్ బస్టాండ్, కనీసం బస్టాండ్ లో ప్రయాణికులకు, మరుగుదొడ్లు లేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మండల కేంద్రమైన బస్టాండ్‌లో, చుట్టుపక్క మండలాల ఉండే కాకుండా ఇతర గ్రామాల నుంచి వచ్చి ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తుంటే, సమయానికి బస్సులు రాకపోవడంతో, మూత్రశాలలు మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే మండల పరిధిలోని కంశేట్‌పల్లి, దుర్కీ, గ్రామాల్లో, బస్టాండ్‌లు, శిథిలావస్థలోకి చేర డంతో, ప్రయాణికులు, కనీసం నిల్చుందామంటే, నీడ లేక రోడ్డుపైనే ప్రయాణికులు గంటల తరబడి నిల్చుంటున్నారు, ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, గ్రామాల్లో ఆర్టీసీ బస్టాండ్లలో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, శిథిలావస్థలోకి చేరిన బస్టాండ్, మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని, మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే నూతనంగా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత, కూడా ప్రజల సౌకర్యాలు పట్టించు కోవడం లేదని, నిత్యం ప్రయాణించే ప్రయాణికుల ఇబ్బందులు గమనించి, ఆర్టీసీ అధికారులు ప్రజలకు, ఆర్టీసీ ప్రాంగణం లో, మరుగుదొడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నసురుల్లాబాద్ బస్టాండ్

● ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

నసురుల్లాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. తరచూ ప్రయాణీకులు నసురుల్లాబాద్ నుంచి బోధన్, నిజామాబాద్, హైదరాబాద్‌కు తరలి వెళ్తుంటారు. కాని బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ఇబబందులు పడుతున్నాం.

● సాయి, ప్రయాణికుడు

కంపు కొడుతున్న గాంధారి వాగు

- గాంధారి వాగులో ఇష్టారీతిన చెత్తా చెదారం వేస్తున్న జనం
- పట్టించుకోని గ్రామ పంచాయతీ సిబ్బంది
- తీవ్ర దుర్గంధంతో ప్రయాణికులకు ఇబ్బందులు

గాంధారి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన వాగులో చెత్తా చెదారంతో పాటు కోళ్ల వ్యర్థపదార్థాలు రాత్రివేళలో వేయడంతో వాగు కంపు కొడుతుంది. గాంధారి, కామారెడ్డి, బాన్సువాడ ప్రధానరహదారి వాగుపై నుంచే ఉండగా ఈ దారి గుండా ప్రయా ణిస్తున్న వారికి తీవ్ర దుర్గందం రావడంతో ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వ్యర్థాలతో వాగు పూర్తిగా నిండిపోవడంతో పశువులు వాగులోని నీటిని తాగడానికి వెళ్లి రోగాల భారిన పడుతున్నాయి. రాత్రివేళలో దుకాణ యాజమానులు వ్యర్థపదార్థాలు బ్రిడ్జిపై నుంచి వాగులో వేయడంతో వాగు మొత్తం దుర్గంధ భరితం అవుతుంది. ఇంత జరుగుతున్న పంచాయతీ సిబ్బంది అటువైపు కన్నెతి చూడక పోవడం శోచనీయమని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రతీ సంవత్సరం గాంధారి వాగులోనే వినాయక నిమజ్జనంతో పాటు బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. అలాంటి వాగును ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇక మండల కేంద్రంలోని మొకరం చెరువులో కొందరు పీఎంపీ, ఆర్ఎంపీలు వాడిన సూదులు, వ్యర్థాలను వేయడంతో గంగపుత్రులు చేపలు పట్టడానికి వెళ్లి అనారోగ్య పాలవుతున్నారు. కాళ్లకు సూదులు గుచ్చుకుంటున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగుతో పాటు మొకరం చెరువులో వ్యర్థాలు వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



వాగులో చెత్తాచెదారం వేసిన దృశ్యం

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



నవీపేటలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట, మే7 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన మహోత్సవం బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కలశ స్థాపన, గణపతి పూజ, పుణ్యవచనం, యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు భూమాచారి, ప్రభాకర్, కృష్ణ, శివకుమార్, శ్రీనివాస్, చందు తదితరులున్నారు.

కమనీయం.. పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణం

కోటగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా గా జరిగింది. వేద పండితులు శ్రీనివాస్ శర్మ, రోహిత్ శర్మలచే పద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణంకన్నుల పండువగా సాగింది. కల్యాణ వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగామణి, నాయకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అక్బర్‌నగర్‌లో పద్మావతి, వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆరోగ్య సంరక్షణకు తోడు.. నేరేడు పండ్లు



రామారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలంలో అల్లనేరేడు పండ్లు జోరుగా అమ్మకాలు కొనసాగుతున్నాయి. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, అన్నారం, మద్దికుంట, సింగిరాయిపల్లి, పోసానిపేట్, ఉప్పల్వాయి, ఇసన్నపల్లి తదితర గ్రామాల్లో, తండాల్లో జోరుగా అల్ల నేరేడు పండ్లు జోరందుకున్నాయి.

● ఔషధాల పండ్లు


అల్లనేరేడు పండ్లు అంటూ అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఔషధ గుణాలు కలిగిన అల్లనేరేడు పండ్లు తినాలని పెద్దలు చెబుతున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో, తండాల్లో పుష్కలంగా అల్ల నేరేడు పండ్లు పుష్కలంగా ఉండేవి. ఇప్పుడు చెట్లను క్రమంగా నరుకుతున్నారు. రెండు నెలలుగా అల్లనేరేడు పండ్లు అమ్మకాలు జోరుగా కొనసాగు తున్నాయి. కాగా అల్లనేరేడు పండ్లు చెట్లు రైతులు నరికివేత కొనసాగుతోంది. గతంలో అల్ల నేరేడు పండ్లు విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగుతుండేవి. ప్రస్తుతం అమ్మకాలు తగ్గడంతో ఆరోగ్యం కోం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

● ఆరోగ్యానికి ఎంతో మేలు అల్ల నేరేడు పండ్లు

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అల్ల నేరేడు పండ్లు ఈ కాలంలో లభిస్తాయి. అల్ల నేరేడు పండ్లు తింటే ఎలాంటి వ్యాధులు రావడానికి వీలు ఉండదు. దీంట్లో క్యాల్షియం, ఇనుము, పొటాషియం, విటమిన్, ఏ, ఈ ఉంటాయని ఆరోగ్యం మెరుగు పడుతుంది.



● డాక్టర్ సురేష్, ప్రభుత్వ వైద్యాధికారి



తారు ఊడిపోయి మట్టిరోడ్డును తలపిస్తున్న వేల్పూర్, అంక్సాపూర్ రోడ్డు



కొత్తపల్లి(కే) గ్రామ సమీపంలో గుంతలుగా ఏర్పడిన బీటీ రోడ్డు దుస్థితి



సాహెబ్‌పేట్, గోవింద్‌పేట్ గ్రామాల మధ్య కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

అధ్వానంగా మారిన రహదారులు

- వేల్పూర్ వద్ద ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

వేల్పూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ఈ రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తారురోడ్లపై తారు చాలాచోట్ల పూర్తిగా ఊడిపోయి కంకరరాళ్లు తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డున చిన్న బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రక్షణ స్తంభాలు కూడా పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. వేల్పూర్ నుంచి రైస్ మిల్లు నుంచి అంక్సాపూర్ వెళ్లే రహదారి, పచ్చల నడ్కుడ బుడిగెడు చెరువు కాలువ మూలమలుపు నుంచి మోతె, అక్లూర్ గ్రామానికి వెళ్లే రోడ్లు, సాహెబ్‌పేట్ గ్రామం నుంచి గోవింద్‌పేట్‌కు వెళ్లే రోడ్లపై బీటీ ఊడిపోయి అక్కడక్కడ కంకరరాళ్లు తేలి పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రోడ్ల వెంబడ చాలాచోట్ల గుంతలు ఏర్పడి కంకరరాళ్లు తేలడం వల్ల ప్రయాణించే టప్పుడు ఎక్కువ సమయం పడుతుందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై నిత్యం ఇతర మండలాల గ్రామాలకు వెళ్లడమే కాకుండా వ్యవసాయ పనుల కోసం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి దెబ్బతిన్న రోడ్లపై వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు పలురోడ్లకు అక్కడక్కడ కోతకుగురై ప్రమాదకరంగా ఉన్నప్ప టికి నేటికి వాటికి మర మ్మతులు చేపట్టలేదు. ఇలాంటి గుంతలు పడిన రోడ్లపై వెళ్ల వాహన దారులు ప్రమాదాల భారీన పడుతున్నారు. అంతేకాకుండా వా హనాలు కూడా దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్లను మరమ్మతులు చేయాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరించడం పట్ల ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే రోడ్లను బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కోతకు గురైన పచ్చల నడ్కుడ, అక్లూర్ రోడ్డు

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది

● గంగాధర్‌గౌడ్, కొత్తపల్లి(కే), గ్రామవాసి

వేల్పూర్ నుంచి కొత్తపల్లి కే గ్రామం బీడుగా అంక్సాపూర్ వెళ్లే రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డుపై కంకరరాళ్లు తేలి గుంతలు అధికంగా ఉండడం వల్ల ప్రయాణించాలంటే తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీంతో తక్కువ దూరానికి ఎక్కువ సమయం పడుతుంది. వాహనాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.



రైతాంగ సమస్యలను పరిష్కరించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్య రైతు సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి దేవరాం, జిల్లా అధ్యక్షుడు సురేష్‌లు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌కు అప్పచెప్పే కుతంత్రాలు మోదీ ప్రభుత్వం చేస్తుందని అందులో భాగంగానే మూడు రైతు వ్యతిరేక చట్టాలను, విద్యుత్ సవరణ బిల్లును ముందుకు తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఎంఎస్‌పీ గ్యారంటీ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ రైతులకు పెద్దపీట వేస్తున్నామని చెబుతూ ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో భాజన్న, కిషన్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించాలి:ఎస్ఈ



ఆంధ్రనగర్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ రవీందర్

నందిపేట్, మే 7 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ మరమ్మతులు చేస్తున్నప్పుడు విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ అన్నారు. ఆంధ్రనగర్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు ప్రతి ఒక్క ఉద్యోగి సేఫ్టీ మెజర్స్‌ను పాటించాలన్నారు. చేతులకు లెదర్ గ్లౌజ్, తదితర పరికరాలను పాటించి విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీఈలు అశోక్, చంద్రశేఖర్, విద్యుత్‌శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఏఈ గంగారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ..విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే వినియోగదారులు సొంతంగా మరమ్మత్తులు చేసుకోకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని వినియోగదారులను కోరారు. ప్రమాదాలు తమకు ఆందోళనను ఆవేదనను కల్గిస్తున్నాయని అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు నివారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గౌడ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

● బోధన్, మండలంలో విద్యుత్ వారోత్సవాలు

బోధన్‌రూరల్: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలు కోల్పోకుండా జీరో ప్రమాదాల కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బోధన్ ట్రాన్స్‌కో ఏడీఈ నగేష్ కుమార్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ నెల 1వ తేది నుండి 7వ తేది వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా సిబ్బంది అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైన్ క్లియర్ తీసుకునేటప్పుడు ఎల్‌సీ ఆఫ్ ద్వారా సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న లైన్‌ల వద్ద ఎర్త్ డిశ్చార్జ్ రాడ్లు, హ్యాండ్ గ్లోవ్స్‌లు, సెఫ్టీ బెల్టులు, సెఫ్టీ జాకెట్లు, గమ్ బూట్లు, తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. విద్యుత్ చాలా ప్రమాదకరమని, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మూగజీవాలను సైతం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్-1 ఏఈ నాయిని కృష్ణ, టౌన్-2 ఏఈ కళ్యాణ్, విద్యుత్ సిబ్బంది గంగాధర్, పెంటయ్య, శ్రీరామ్, రమేష్, లక్ష్మణ్, ముజీబ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతి



చిరుత కళేబరం

ఇందల్వాయి, మే 7(ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుతపులి మృతి చెందినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. మూడు సంవత్సరాల మగ చిరుతపులి 44వ జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసు కున్న ఫారెస్టు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని చిరుత కళేబరాన్ని తిర్మన్‌పల్లి ఫారెస్టు సెంట్రల్ నర్సరీకి తరలించి పంచనామా నిర్వహించారు. గతంలో కూడా చంద్రయాన్‌పల్లి అటవీ ప్రాంతంలో చిరుతను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా గాయాలు అయ్యాయి.

సార్వత్రిక సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించతలపెట్టిన ఒక్కరోజు సార్వత్రిక సమ్మె పోస్టర్లను సీఐటీయూ నాయకులుఆవిష్కరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ లేబర్ కోడ్‌లను రద్దుచేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా అన్ని రంగాల కార్మికవర్గం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, టీజీయుఈఈయు సీఐటీయు రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరి చంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ప్రభాకర్, మురళి, థామస్, మహేష్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్,మే 7(ఆంధ్ర జ్యోతి):పట్టణంలోని కొత్త బ స్టాండ్, అంగడి బజార్‌లో ఎస్ హెచ్‌వో సత్య నారాయణ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.అనుమానా స్పద వ్యక్తులను వారి వద్దఉన్న లగేజీలను శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్‌ల సహాయంతో మాదకద్రవ్యాలు ఇతర అక్రమ పదార్థాలను గుర్తించడానికి తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బం ది ఉన్నారు.

తెలుగోడి తెగువను చాటి చెప్పిన మన్యం వీరుడు అల్లూరి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



కోటగల్లిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలుగోని తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన మన్యం వీరుడు అల్లూరి అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం కోటగల్లిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయానికి నాంది పలికిందన్నారు. తెలుగుజాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన వీర కిశోరం అగ్గిపిడుగు అల్లూరి అని పేర్కొన్నారు. మన్యం ప్రజల మాన ప్రాణ రక్షణకు తెల్లదొరలను ఎదురించి గిరిజన జాతిని ఏకం చేసి అణగారిన గిరిజన జాతిలో విప్లవ చైతన్యాన్ని నింపిన వ్యక్తి అల్లూరి సీతా రామరాజు అని అన్నారు. ఆ మహావీరుడు గిరిజన జాతికే కాదు యా వత్ భారతదేశానికే ఆదర్శ ప్రాయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్లు, మండలఅధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ:అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతి సందర్భంగా సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు జిల్లా కార్యదర్శి భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మాస్‌లైన్ నాయకులు కూడా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసులను చంపడాన్ని ఖండించారు.కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి, సీపీఐఎంఎల్ మాస్ నాయకులు నారాగౌడ్, రమేష్, లింబాద్రి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్:మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలోని కోటగల్లి లోగల ఆయన విగ్రహానికి నుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అంతరెడ్డి దేవేందర్, రాజేష్, సుదర్శన్, గంగరాజు, తపాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు ప్రాంతాల్లో సీతరా మరాజు విప్లవ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. పలు సంఘాల నా యకులు మాట్లాడుతూ దేశం కోసం అల్లూరి ప్రాణాలర్పించాడని కొని యాడారు. సీతారామరాజు అడుగు జాడల్లో యువత నడుస్తూ స్ఫూర్తి దాయకంగా నిలవాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో టీయూ సీఐ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి సభలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి విప్లవ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మట్టిలాంటి మనుషులను మరఫిరంగులుగా చేసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన గొప్పవీరుడు కామ్రేడ్ సీతారామరాజు అని కొనియాడారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, వెంకన్న, రాజేశ్వర్, లింగం, లక్ష్మణ్, రాజేశ్వర్, లక్ష్మీనారాయణ, గంగాధర్, అన్వర్, మల్లేష్ మోహన్, విశ్వనాథ్, దర్మపురి, దేవీదాస్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: స్వాతంత్ర పోరాటంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి వీర మరణం పొందిన అల్లూరి సీతారామ రాజు 101వ వర్ధంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో బోర్గాం గ్రామంలోని అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంకోసం అలుపెరుగని పోరాటం చేసి వీర మరణం పొందిన అల్లూరి సీతారామ రాజు సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నసీర్, ఒడ్డెన్న, నాగన్న, సిద్ద పోశెట్టి, లక్ష్మణ్, అబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో అల్లూరి సీతారామ రాజు వర్ధంతిని నిర్వహించారు. అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా 28సంవత్సరాల క్రితమే ప్రాణాలను భారతమాత స్వేచ్ఛకై త్రుణపాయంగా ప్రాణాలను అర్పించిన వీరమాన్య యోధుడు, విప్లవకారుడు అల్లూరి సీతారామ రాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, లింగారెడ్డి, గణేష్ గౌడ్, రవి, గంగాధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలు కాదు.. ఫెయిల్యూర్ సీఎం పోటీలు పెట్టండి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



కోనాసముందర్‌లో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, పథకాలు ఎప్పుడు వస్తాయా? అని ఎదురు చూస్తుంటే ఉకదంపుడు హామీలతో రాష్ట్ర ప్రజానీకానికి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అందాల పోటీలునిర్వహించడం హాస్యాస్పందగా ఉందన్నారు.అందాల పోటీలు కాదురాష్ట్రప్రజలను మోసంచేసిన, పథకాలు అమలు చేయని ఫెయిల్యూర్ సీఎం పోటీలు పెడితే దేశంలో ఫెయిల్యూర్ సీఎంగా రేవంత్‌రెడ్డికే ప్రథమబహుమతి వస్తుందన్నారు.బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలంలో పలుఅభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రం దివాళాతీసిందని రాష్ట్ర పరువును బజారుకీడ్చేలా మాట్లాడే సీఎం దేశంలో ఎవరు లేరని అన్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగావిఫలమైన సీఎం పాలన చేతకాక పోతే దిగిపోవాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే సీఎంగత పాలకులు చేసిన అప్పుడు ష్పచారం చేయడం సరికాదన్నారు. మీరు 17నెలల్లో రూ.లక్ష60 వేలకోట్ల అప్పులు చేసి ఒక్క ఇటుకైన పేర్చి అభివృద్ధి చేశావా? అని ప్రశ్నించారు. అప్పుచేస్తూ ఢిల్లీకిమూటలు మాత్రం పంపావని ఆరోపించారు. కేసీఆర్ 10ఏళ్లలో రూ.4లక్షల 17 వేల కోట్ల అస్తులు చేసి 24గంల విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు, రాజధానిలో సెక్రటేరియట్, రాష్ట్ర వ్యాప్తంగా 33 కలెక్టరెట్‌లు, 125 లడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అమరవీరుల స్తూపం,33 మెడికల్ కళాశాలలు ఆసుపత్రులు ఏర్పాటుతోపాటు రైతులకు సకాలంలో రైతుబంధు ఇలాఅనేకనేక అభివృద్ధి పనులు చేస్తూ ఆస్తులు సృష్టించారని అన్నారు.కాగ్ లెక్కల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అసలు వడ్డీకలిపి కట్టింది.మిగిలిన సొమ్ము ఎటోపోయిందో ప్రజలకు చెప్పాలని డిమాడ్ చేశారు. ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని అడిగితే అప్పులు పుట్టడంలేదు చెప్పులు ఎత్తుకుపోయేవాల్లలా చూస్తున్నారని రాష్ట్రం దివాలాతీసింది. ముఖ్యమంత్రిని మార్చి పార్టీలోని శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్,బట్టీలాంటి సీకన్నలర్హులైన వారున్నారనివారికి అవకాశం కల్పించాలని ఈ విషయం రాహుల్ గాంధీకి సూచిస్తున్నట్లు అన్నారు. సీజన్ మొదలై 40రోజులు గడుస్తున్నా ఒక్క రైతులకు బోనస్ ఇచ్చిన దాఖలాలులేవన్నారు.వెంటనే బోన్ చెల్లించాలని డామాండ్ చేశారు. సీఎం రేవంత్‌ను దించాలని లేదంటే మరో 20ఏళ్ల కాంగ్రెస్ మరుగున పడడం ఖాయమన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు.

● ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు పైసా నిధులు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

ఇచ్చిన హామీలవిషయమై నియోజికవర్గంలో అటు అసెంబ్లీలో ప్రభుత్వాని ప్రశ్నించినందుకు తనతోపాటు రాష్ట్రంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ ప్రభుత్వం పైసా అభివృద్ధి నిధులు ఇవ్వనిడంలేదని అయి నా ప్రజలపక్షంలో పోరాటం తప్పదన్నారు. ప్రస్తుతం బాల్కొండ నియోజికవర్గంలో ప్రజల, రైతులు సౌకర్యార్థం రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌లు సమకూర్చి నిధులతో నియోజికవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలపక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమలో డీసీవో శ్రీనివాస్, మండలపార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్‌లు సామబాపురెడ్డి, కుంట ప్రతాప్ రెడ్డి, ఆకుల రాజన్న, గడ్డం స్వామి, రాజగౌడ్, సుధాకర్, నరేందర్, ఏనెడ్ల రవిందర్, ఇంద్రాల రాజు, ఆవారి గంగారెడ్డి, ఆవారి మురళి, పిప్పెర అనీల్, ప్రకాశ్ నాయక్, గంగాధర్, బద్దంరాజేశ్వర్ తదితర మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీగా మస్తాన్‌అలీ బాధ్యతలు



నగరంలో ట్రాఫిక్ ఏసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐలు

నిజామాబాద్‌అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీగా మస్తాన్ అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ ఏసీపీగా పనిచేసిన నారాయణపై అవినీతి ఆరోపణలు రాగా ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో మస్తాన్ అలీని ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేయగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా ఆయన పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన ఏసీపీకి సీఐలు ప్రసాద్, చందర్ రాథోడ్, ఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అర్ధరాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం



ధర్పల్లి- దమ్మన్న పేట రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్లు

ధర్పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం 2గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఈదురు గాలుల వల్ల రోడ్లపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. మండల కేంద్రం శివారులోగల షాదీఖానా ప్రాంతంలో ధర్పల్లి, దమ్మన్నపేట్ బీటీ రోడ్డుపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనుకోకుండా కురిసిన భారీ వర్షంతో ఎండ వేడి నుంచి ప్రజలు కొంత ఉపశమనం పొందారు. మండలంలో వరి కొనుగోలు కేంద్రాల్లో వడ్లు లేకపోవడంతో రైతులకు ఎలాంటి నష్టం జరగలేదు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అభినందన

సిరికొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): సిరికొండలో గల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగారావు అన్నారు. ఎస్సెస్సీ 2025 ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల కంటే సిరికొండ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్‌లుగా నిలిచారని అన్నారు. ముకేష్ 563, జశ్వంత్ 541, ప్రశాంత్ 540 మార్కులు సాధించారని వారికి శాలువాతో సన్మానించి నాగారావు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భోజారావు, ధనంజయ్, హారిక, ఉపాధ్యాయులు శివరాం, ప్రశాంత్, పాల్గొన్నారు.

నేటి నుంచి గంగమ్మతల్లి ఉత్సవాలు

సిరికొండ, మే 7 (ఆంధ్రజ్యోతి):సిరికొండ మండల కేంద్రంలో గురు వారం, శుక్రవారం జరిగే గంగమ్మ తల్లి ఉత్సవాలకు సిద్ధం చేశారు. స్థానిక మత్స్యసహకార సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగే రెండు రోజుల ఉత్సవాలలో గంగమ్మతల్లి, శివుని కళ్యాణం, యజ్ఞం, బోనాల ఊరేగింపు ఉంటుందని సంఘ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం నుండి యజ్ఞం నిర్వహిస్తామని శుక్రవారం శివుడు, గంగమ్మతల్లి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఈ సందర్భంగా జాతర, అన్నప్రసాదం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

సుద్దులంలో సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన

కోటగిరి,మే7(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండవలంలోని సుద్దులం తండాలో శ్రీ జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహరాజ్‌ల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోరాదేవి, బాబుసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గోపూజ, గణపతి పూజ, గౌరీ పూజ, విగ్రహాల ఊరేగింపు, యాగశాల ప్రదక్షిణ, అఖండ దీపారాధన కార్యక్రమాలు చేపట్టారు. గురువారం కుంకుమార్చన, ధూపదీప నైవేద్య హారతి, శుక్రవారం పుణ్యావచనం, పంచగవ్య, ప్రసన్న ప్రతిష్టాపన హోమం, విగ్రహ ప్రాణ ప్రతిష్టా, శిఖర ప్రతిష్ట, ధ్వజ స్థాపన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జన్మదినోత్సవాలు



బోధన్ నగరేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బోధన్‌రూరల్,మే7(ఆంధ్రజ్యోతి): వైశాఖ శుద్ధ దశమి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మోత్సవం సందర్భంగా బోధన్ పట్టణం పోస్టాఫీస్ వద్ద గల శ్రీ నగరేశ్వర శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మదినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి నూతన వస్త్ర అలంకరణ, అష్టదశ పండ్లతో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు, పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన, మహిళలు, భజనలు, కీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త రాజేశ్వర్, గంజి వెంకటేశం, పబ్బ మురళి, కంటాల రమేష్, కన్నె సంతోష్, వాసర గంగాధర్, కిరణ్, శ్రీధర్‌లతో శక్కర్‌నగర్, కొత్త బస్టాండ్, రాకాసిపేట్, ఎల్‌బీఎస్ నగర్, పోస్టాఫీస్,, భక్తులు ఉన్నారు.

ముప్కాల్: ఆర్యవైశ్య కులదేవత వాసవి కన్యక పరమేశ్వరి జయంతి వేడుకలను ముప్కాల్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి శోభాయాత్ర

నిజామాబాద్ కల్చరల్: వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారి శోభాయాత్ర ఘనంగా సాగింది. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి వాసవీ వైశ్యసంఘం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై శోభయాత్రను ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. బ్రహ్మపురి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పెద్దరాంమందిర్, వర్ని చౌరస్తా, బోయిగల్లి, వివేకానంద చౌరస్తా, గాజుల్‌పేట్ మీదుగా పెద్దబజార్, పెద్దపోస్టాఫీస్, గాంధీచౌక్, గంజ్ మీదుగా కిషన్ గంజ్‌లోని వాసవీ అమ్మవారి దేవాలయం వరకు సాగిం ది. ఈ కార్య క్రమంలో వీరశేఖర్ గుప్త, శివప్రసాద్, విశ్వనాథం, ఇల్లెందుల ప్రభాకర్, నవీన్,ధనలక్ష్మీ, ప్రవీణ్ కుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● భక్తుల దర్శనార్థం అమ్మవారి శోభాయాత్ర: ఎమ్మెల్యే ధన్‌పాల్

భక్తులను అనుగ్రహించడానికి వాసవీ అమ్మవారు శోభయాత్రగా ఊరేగారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అమ్మవారు సర్వశక్తులను భక్తులకు అందించడానికి ఆర్యవైశ్యులను ఏకతాటిపై తేవడానికి 102గోత్రాలతో భక్తులచేత పూజలు అందుకున్నారని అన్నారు.

ఇందల్వాయిలో ఉచిత శిక్షణ తరగతులు

ఇందల్వాయి,మే7(ఆంధ్రజ్యోతి):మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 10 నుంచి 20 వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన 4వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. 100 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణలో మ్యూజిక్, డ్యాన్స్, డ్రాయింగ్, పేయింటింగ్, యోగా, చిత్రలేఖనం, తదితర అంశాలపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి 1గంట వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం ఇందల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 6300887171 సంప్రదించాలని కోరారు.

సెమిస్టర్ పరీక్షలు బహిష్కరిస్తాం

● వీసీ, రిజిస్ట్రార్‌లకు వినతి పత్రం అందజేసిన ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు

డిచ్‌పల్లి,మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఏన్నో మార్లు వినతి పత్రం అందజేసిన ప్రైవేట్ కళాశాలల గోడు ను వినిపించుకోవడం లేదని అందుకు నిరసనగా డిగ్రీ సెమిస్టర్ పరీక్ష లను బహిష్కరిస్తున్నట్లు టీయూ పరిధిలోని ప్రైవేట్ కళాశాలల ప్రతి నిధులువీసీ, యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలకు బుధవారం వినతి పత్రం అందజేశారు.విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల బకాయిలను చెల్లించాలని గతకొన్నేళ్లుగా కోరుతున్న ప్రభుత్వంపట్టించుకోకపోవడం సరికాద న్నారు. బకాయిలు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కళాశాలలు నడిపేపరిస్థితి లేదని అధ్యాప కులకు,వేతనాలు, విద్యా ర్థులకు సౌకర్యాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిం దని, వీసీ, రిజిస్ట్రార్‌లకు తెలి పారు. వీసీ, రిజిస్ట్రార్ ను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజీ హరి ప్రసాద్, కార్యదర్శి సంజీవ్, నరాల సుధాకర్, అరుణ్, గురు రాఘవేందర్, పాల్గొన్నారు.

భూవివాదంపై రెవెన్యూ అధికారుల విచారణ

డిచ్‌పల్లి,మే 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని దూస్‌గాం గ్రామ శివారులో గ్రామ దేవతాలకు సంబంధించిన స్థలాన్నిఒకరు కబ్జా చేయడానికి ప్రయత్నించడంతో వీడీసీ సభ్యులు, రెవెన్యూ, పోలీసులకు పిర్యాదు చేశారు. పిర్యాదు మేరకు ఆర్‌ఐ సంతోశ్, స్థానిక పోలీసులతో భూమి వద్దకు చేరుకొని విచారణ చేశారు. ఈ విషయంపై భూమి చదును చేసిన వ్యక్తికి ఆర్ఐ ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో ఆర్ఐ మాట్లాడుతూ..ఈ భూమి విషయం కోర్టు పరిధిలో ఉన్నందున రికార్డును పరిశీలిస్తామని గ్రామస్థులు ఏలాంటి ఆందోళనకు గురికావద్దని సూచించారు. గ్రామస్థులు వివాదస్పద ప్రాంతానికి చేరుకున్నారు.